సాక్షి
నిజామాబాద్
శనివారం, 9, డిసెంబర్, 2023



ఓపీ రిజిస్ట్రేషన్ ఉంటేనే..

ఓపీ రిజిస్ట్రేషన్ చేసుకుని వస్తేనే చికిత్స చేస్తామని చెప్పడంతో ఫుడ్ పాయిజన్ బాధిత విద్యార్థులు ఓపీ కోసం క్యూలో నిల్చున్నారు.

- 8లో ▸



పీఎఫ్ సేవలు సులభతరం

ఉమ్మడి జిల్లా వాసులకు పీఎఫ్ సేవలు మరింత సులభతరం చేస్తున్నామని కమిషనర్ గణేశ్ కుమార్ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
23.8 /16.9

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండవచ్చు. చల్లటి గాలులు వీస్తాయి. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రివేళ చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

యథావిధిగా 'ప్రజావాణి'

సుభాష్‌నగర్ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఎప్పటిలాగే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ప్రజావాణిని తాత్కాలికంగా వాయిదా వేసిన విషయం విదితమే. ప్రస్తుతం ఎన్నికలు ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం ప్రతిసోమవారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

11వ తేదీ నుంచి బడి బయట పిల్లల గుర్తింపు

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని బడిబయట ఉన్న పిల్లల సర్వేను ఈనెల 11వ తేదీ నుంచి చేపడుతున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశానుసారంగా ఈనెల 11 తేదీ నుంచి వచ్చే నెల జనవరి 10వ తేదీ వరకు సర్వే చేపడుతాం అన్నారు. ఈ సర్వేలో ఆరేళ్ల నుంచి 14 ఏళ్లు, 15 నుంచి 19 ఏళ్ల విద్యార్థులను గుర్తిస్తామన్నారు. మండలస్థాయిలో మండల విద్యాశాఖ అధికారులు కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, సీఆర్పీలు తదితరులు విద్యార్థులను గుర్తించి వారి వివరాలను జిల్లాస్థాయికి పంపించాలన్నారు.

పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్, ఏజెన్సీ రద్దు

నిజామాబాద్‌అర్బన్ : బోర్గ(పి) పాఠశాలలో గురువారం జరిగిన వికటించిన మధ్యాహ్న భోజనం ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మిని సస్పెన్షన్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ కూడా రద్దు చేశారు. పాఠశాలలో గురువారం మధ్యాహ్నం భోజనం తిన్న 16 మంది విద్యార్థులు అస్వస్థకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి శుక్రవారం ఎంఈఓ రామారావు విచారణ జరిపారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ తప్పిదం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యవైఖరి కారణాలను చూపుతూ ఈ చర్యలు తీసుకున్నారు.

ఈసీఐఎల్‌కు ఈవీఎంల తరలింపు



సుభాష్‌నగర్ : జిల్లాకేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను శుక్రవారం ఈసీఐఎల్ ఫ్యాక్టరీకి తరలించారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్‌లో సమస్యలు తలెత్తిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను మరమ్మతుల కోసం హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు తరలించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. వాహనం హైదరాబాద్ వెళ్తున్న క్రమాన్ని సైతం జీపీఆర్ఎస్ ద్వారా పర్యవేక్షించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం అధికారులు పవన్, సాత్విక్, సంతోష్, జితేందర్ తదితరులు ఉన్నారు.

12 నుంచి నామినల్ రోల్స్ సమర్పించాలి

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు ఈనెల 12వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు సంబంధించి నామినల్ రూల్స్ సమర్పించాలని డీఈ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీన బోధన్‌లోని బోధన్ డిప్యూటీ డీఈవో కార్యాలయంలో 13న ఆర్మూర్‌లోని ఎమ్మార్సీ కార్యాలయంలో, 14న నగరంలోని మోడ్రన్ హైస్కూల్లో నామినల్ రోల్స్ సమర్పించాలన్నారు.

బాలల హక్కులపై అవగాహన



ధర్పల్లి : ధర్పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కులను ఏ రకంగా ఉపయోగించుకోవచ్చో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జీ వివరించారు. 1098 నెంబర్ యొక్క ఉపయోగాలను వివరించారు. హైస్కూల్ హెచ్‌ఎం జ్యోతిరాణి, ఐసీపీఎస్ సిబ్బంది స్వప్న, ప్రవంతి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




సెజ్ భూముల్లో అక్రమంగా వేసిన ఫెన్సింగ్

సెజ్ భూములకూ ఎసరు

- 200 ఎకరాలు కబ్జా చేసేందుకు జీవన్‌రెడ్డి స్కెచ్
- మళ్లీ గెలిస్తే ప్లాట్లు చేసి అమ్ముకునేందుకు పక్కా ప్లాన్
- సెజ్‌లో గుట్టను తవ్వి మొరం అమ్ముకున్న వైనం
- ప్రశ్నించిన వారిపై కేసుల బనాయింపు
- మాజీ ఎమ్మెల్యే అక్రమాలకు వత్తాసు పలికిన కొందరు అధికారులు

ఏకంగా 200 ఎకరాలు కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి.. లక్కంపల్లి సెజ్ భూములను అమ్ముకునేందుకు గాను లేఅవుట్ సైతం సిద్ధం చేసిన వ్యవహారం బయటపడింది. ఈ క్రమంలో ఆ భూముల్లో ఉన్న గుట్టను నిబంధనలకు విరుద్ధంగా తవ్వించి మొరం అమ్ముకున్నారు. ఇలా మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అక్రమాలను ఒక్కొక్కటిగా బాధిత వర్గాలు బయటపెడుతున్నాయి.





సెజ్ భూముల్లో ప్లాట్లు చేసేందుకు వేసిన లేఅవుట్ ప్లాన్, నిబంధనలకు విరుద్ధంగా తవ్విన మొరం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రజాప్రాతినిధ్య చట్టం మేరకు ప్రజలు ఎన్నుకుంటే.. ఆ ప్రజలనే భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు ప్రజల, ప్రభుత్వ ఆస్తులను యథేచ్ఛగా కబ్జాలు చేస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ వచ్చిన మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అరాచకాలు మరిన్ని వెలుగులోకి వస్తున్నాయి. భూ ఆక్రమణల పర్వం ఒక అంశమైతే ఏకంగా టీఎస్‌ఐఐసీకి చెందిన సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండలి) భూములకే ఎసరు పెట్టిన వైనం విస్మయం కలిగిస్తోంది. పది కాదు ఇరవై కాదు ఏకంగా 200 ఎకరాలను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు గాను లేఅవుట్ ప్లాన్ సైతం సిద్ధం చేసుకున్న వ్యవహారం బయటపడింది. జీవన్ రెడ్డి చేసిన ఈ అక్రమ వ్యవహారాలకు కొందరు ప్రభుత్వ అధికారులు సైతం బాధ్యత మరిచి వత్తాసు పలకడం గమనార్హం. పైగా బాధ్యతతో అక్రమాన్ని అడ్డుకుని ప్రశ్నించిన పౌరులను బెదిరించడంతో పాటు అక్రమంగా కేసులు సైతం బనాయించడం అరాచకానికి నిదర్శనంగా కనిపిస్తోంది. జీవన్‌రెడ్డి, అతని అనుచరులు చేసిన అరాచకాల బాధితులు ప్రస్తుతం ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.

- నందిపేట మండలంలోని లక్కంపల్లి వద్ద 2009లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వ్యవసాయ అనుబంధ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించి స్థానికంగా ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు గాను రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా 429 ఎకరాలు కేటాయించారు. వైఎస్ఆర్ మృతి తరువాత అప్పటి మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి దీని కోసం రూ.50 కోట్లు కేంద్రం నుంచి మంజూరు చేయించారు. ప్రహరీతో పాటు రోడ్లు నిర్మించారు. స్మార్ట్ ఆగ్రో కర్క్యుమిన్ యూనిట్‌తో పాటు కొన్ని గోదాములు నెలకొల్పారు. అయితే తెలంగాణ ఏర్పాటు తరువాత ఆర్మూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన జీవన్‌రెడ్డి మాత్రం సెజ్‌లో యూనిట్ల స్థాపన కోసం వచ్చిన వారిని 30 శాతం వాటాలు అడగడంతో పెట్టుబడిదారులు వెనక్కు వెళ్లిపోయారు. దీంతో జీవన్‌రెడ్డి ఇదే అదునుగా భావించి ఈ భూములను కాజేసేందుకు ప్రణాళికను తయారు చేసుకున్నాడు. 200 ఎకరాల కబ్జాకు చకచకా పావులు కదిపాడు. ఈ క్రమంలో ఇందులో ఉన్న గుట్టను సైతం టీఎస్‌ఐఐసీ నిబంధనలకు విరుద్ధంగా తవ్వించి మొరం అమ్ముకున్నారు. ఈ తవ్వకాలను అతని అనుచరుడైన లక్కంపల్లి మహేందర్ ద్వారా చేయించాడు. ఈ మహేందర్‌ను లక్కంపల్లి ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్ హత్యలకు సుపారీ గ్యాంగ్‌ను పిలవడంతో పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో గంజాయి సరఫరా చేస్తున్న మహేందర్ వద్ద పోలీసులు గంజాయి భారీగా స్వాధీనం చేసుకున్నారు. మహేందర్‌పై ఏ-1 కాకుండా జీవన్‌రెడ్డి అధికారులపై ఒత్తిడి చేసి అడ్డుపడ్డాడు. ప్రస్తుతం మహేందర్ బెయిల్‌పై ఉన్నాడు. ఇదే మహేందర్ నియోజకవర్గంలోని ఓ ఎంపీటీసీని తుపాకీతో బెదిరించి బీఆర్ఎస్‌లో చేరాలని ఒత్తిడి చేశాడు. ఇలా మహేందర్, గోపు రంజిత్, మరికొందరు వ్యక్తులతో జీవన్‌రెడ్డి అనేక భూకబ్జాలు చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా బాధితులు బయటకు వస్తున్నారు.

5,058 ప్లాట్లకు లేఅవుట్..

200 ఎకరాల సెజ్ భూములను కబ్జా చేసి, మూడోసారి గెలిస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైతే అందులో 5,058 ప్లాట్లు వేసేలా లేఅవుట్ ప్లాన్ తయారు చేసుకున్నారు. ఇందులో బ్లాక్-1లో 2,715 ప్లాట్లు, బ్లాక్-2లో 2,343 ప్లాట్లు ఉండేలా వెంచర్ ప్లాన్ రూపొందించుకున్నారు. ఈ అక్రమ వ్యవహారాలను అడ్డుకునేందుకు గాను ప్రశ్నించిన బాధ్యతాయుత వ్యక్తులపై అక్రమంగా కేసులు పెట్టించాడు. ఒక వ్యక్తిపై అట్రాసిటీ, మరో నలుగురిపై ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించినట్లు అక్రమంగా కేసులు నమోదు చేయించారు. సెజ్ భూముల్లో అక్రమంగా లేఅవుట్ వేసేందుకు సహకరించిన అప్పటి పంచాయతీ కార్యదర్శి రమేష్, ప్రశ్నించిన నలుగురు వ్యక్తులపై విధులకు ఆటంకపరిచారనే నెపంతో అక్రమంగా కేసులు పెట్టడం గమనార్హం.



సెజ్ భూముల్లో అక్రమంగా వేసిన ఫెన్సింగ్

మహిళలకు ఆర్టీసీలో ప్రయాణం ఫ్రీ

- నేటి నుంచి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో..
- బాలికలు, ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా..
- ఉమ్మడి జిల్లాలో 850 గ్రామాలకు బస్సు సౌకర్యం
- ఆర్టీసీపై రోజూ రూ. 35 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు భారం



ఖలీల్‌వాడి : నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో 'మహాలక్ష్మి పథకం' కింద మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించనుంది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కూడా ఒకటి. అందులో భాగంగా జిల్లాలో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచితంగా ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 1 గంటలకు హైదరాబాద్‌లోని అసెంబ్లీ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. సీఎం ప్రారంభించిన తర్వాత ఈ పథకం అమల్లోకి వస్తుందని ఆర్టీసీ వర్గాల ద్వారా తెలిసింది. ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోలున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 974 గ్రామాలు ఉండగా ఇందులో 850 గ్రామాలకు బస్సు సౌకర్యం అందుబాటులో ఉంది. బస్సులో ప్రయాణించే మహిళలు బస్సు టిక్కెట్ తీసుకునే అవసరం ఉండదు.

615 బస్సులు..

ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల్లో 615 బస్సులున్నాయి. ఇందులో 426 బస్సులు ఉండగా ఆర్టీసీ బస్సులు ఉండగా ఆర్టీసీ హెయిర్ బస్సులు 189 బస్సులు వివిధ మార్గాల్లో ప్రయాణిస్తాయి. ఉమ్మడి జిల్లాలో 256 మార్గాల్లో బస్సులు నడుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజు అన్ని రూట్‌ల్లో 2.28 లక్షల కి.మీ బస్సులు ప్రయాణం చేస్తున్నాయి. ఆధార్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. గుర్తింపుకార్డు లేకున్నా బస్సులో ప్రయాణం చేయవచ్చు.

256 రూట్లలో..

ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలున్నాయి. ఈ ఆరు డిపోల్లో ఎక్కువగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లే నడుస్తాయి. ఉమ్మడి జిల్లాలోని 256 రూట్‌ల ద్వారా ప్రతిరోజు ఆర్టీసీకి రూ. 90 లక్షల ఆదాయం వస్తుంది. ఇందులో 50 శాతం మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం ద్వారా ఆర్టీసీ రీజియన్‌కు రూ. 35 లక్షల నుంచి రూ. 40 లక్షలు ఆర్టీసీపై భారం పడుతుందని సమాచారం.

అమలు చేస్తాం..

సీఎం రేవంత్‌రెడ్డి పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఉమ్మడి జిల్లాలో అమల్లోకి వస్తుంది. అన్నివర్గాల మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల్లోనే బస్సు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డు గాని ఇతర కార్డులను బస్సు కండక్టర్‌కు చూపించాలి. కార్డులు లేకపోయినా ప్రయాణానికి అనుమతిస్తారు.

– జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం, ఉమ్మడి జిల్లా

జిల్లాను కప్పేసిన పొగమంచు..



పాంగ్రా శివారులో రోడ్డుపై కమ్ముకున్న పొగమంచు

జిల్లాను మంచుదుప్పటి కప్పేసింది.. శుక్రవారం తెల్లవారుజాము నుంచే పూర్తిగా పొగమంచు కమ్మేయడం.. వాతావరణం చల్లగా ఉండడంతో పాటు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఉదయం 8 గంటలు దాటినప్పటికీ రహదారులు కనిపించక వాహనదారులు అవస్థలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

జిల్లాకు అయోధ్య రాముడి అక్షింతలు

- ర్యాలీగా తీసుకొచ్చిన పిట్ల కృష్ణ మహరాజ్
- పూజలు చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ సిటీ : అయోధ్య శ్రీరాముడి మందిరంలో ప్రాణప్రతిష్ఠ చేసిన అక్షింతలు ఇందూరుకు శుక్రవారం చేరుకున్నాయి. అక్షింతలు హైదరాబాద్ నుంచి ఉదయం 11 గంటలకు బోర్గాం చౌరస్తాలోని శ్రీ రామ మందిరానికి చేరుకోగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఇందూర్ జిల్లా కమిటీ సభ్యులకు అక్షింతలను అందజేశారు. అనంతరం బోర్గాం బ్రిడ్జి నుంచి పెద్ద రాంమందిర్ వరకు జిల్లా కేంద్రంలో పలు మార్గాల మీదుగా బైక్ ర్యాలీ పెద్ద రాం మందిర్‌కు చేరింది. ఈ ర్యాలీని మల్లారం పిట్ల కృష్ణ స్వామి, అగ్గు స్వామి అందాపూర్ స్వామిజీ, వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం అక్షింతల కలశాన్ని పెద్ద రాం మందిర్ శ్రీ రాముడి ఆలయంలో ఉంచారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ కార్పొరేటర్లు పెద్ద రాం మందిరానికి వచ్చి పూజలు నిర్వహించారు. ఈ అక్షింతలు పెద్ద రాంమందిరంలో ఈనెల 31 వరకు ఉంటాయి. అనంతరం జనవరి ఒకటి నుంచి 15 వరకు అక్షింతలను నగరంలో ప్రతి ఇంటికి పంపిణీ చేయనున్నారు. అయోధ్యలో జనవరి 21న శ్రీ రాముడి ఆలయం ప్రారంభం కానుండటంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, ఉపాధ్యక్షుడు రెబ్బ ఆనంద్, సహ కార్యదర్శులు ధాత్రిక రమేష్, అరుణ్ రెడ్డి, హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు అనిల్ కథం, నగర అధ్యక్షుడు సనాతన శ్రీకాంత్, బినయ్, శివాజీ, యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్, రాంప్రసాద్ చటర్జీ, శ్రీరాంసేన అధ్యక్షుడు అఖిల్, శ్రీనివాస్, సంఘ్ నాయకులు వెంకటేష్, ప్రణయ్, అంజి, ఆర్మూర్ ప్రాంత నాయకులు నిఖిల్, రవి తదితరులున్నారు.



అక్షింతలను తీసుకొస్తున్న మల్లారం లింగేశ్వర్ గుట్ట పిట్ల కృష్ణ మహరాజ్ తదితరులు



బడా రాంమందిర్‌లో అక్షింతలను అర్చకులకు అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నెమ్మదించిన ఆయిల్‌పాం

- 1,500 ఎకరాల్లోనే సాగు చేస్తున్న రైతులు
- ఈ ఏడాది 4,500 ఎకరాల్లో నాటాలని లక్ష్యం
- పంట వేసేందుకు సంకోచిస్తున్న రైతులు
- ముందుకు రావాలని కోరుతున్న అధికారులు



చేపూర్ నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలో ఆయిల్ పాం సాగు పూర్తిగా నెమ్మదించింది. రైతుల్లో ఆసక్తి పెరిగినప్పటికీ పెద్దగా సాగు చేస్తున్నట్లు ఎక్కడా కనిపించట్లేదు. కొంతమంది రైతులు మాత్రమే ఆయిల్‌పాంను సాగు చేయడానికి ముందుకు వస్తుండడంతో ఉద్యాన శాఖ గత రెండేళ్లుగా లక్ష్యాన్ని చేరుకోలేకపోతోంది. ప్రస్తుత ఏడాది కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రైతులకు ఇతర లాభాదాయకమైన పంటల వైపు మళ్లించేందుకు గత ప్రభుత్వం ఆయిల్ పాం తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందుకు మొక్కలతో పాటు బిందు సేద్యం యూనిట్లను కూడా సబ్సిడీపై అందిస్తోంది. ఐతే, 2023-24కు గాను జిల్లాలో 4,500 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలను సాగు చేయించాలని ఉద్యాన శాఖకు లక్ష్యం ఉంది. ఇప్పటి వరకు సుమారు 900 మంది రైతులు 2,300 ఎకరాల్లో సాగు చేయడానికి ప్రభుత్వానికి డీడీలు చెల్లించారు. ఇందులో 1,500 ఎకరాల వరకు ఆయిల్ పాం మొక్కలు నాటడం పూర్తయింది. ఐతే, ఎన్నికల కోడ్ రావడంతో గత రెండు నెలలుగా కార్యక్రమం నెమ్మదించింది. డీడీలు కట్టిన రైతులకు మొక్కలు, డ్రిప్‌లు ఇవ్వలేదు. ప్రస్తుతం ఎన్నికలు ముగియడంతో లక్ష్యానికి అనుగుణంగా మరింత మంది రైతులను ఆయిల్ పాం వైపు మళ్లించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకా 3వేల ఎకరాల వరకు మొక్కలు నాటించాల్సి ఉంది. ఈ టార్గెట్‌ను 2024 మార్చి వరకు చేరుకోవడం సాధ్యమయ్యే పనికాదని చెప్పవచ్చు.

సబ్సిడీ ఇస్తున్నా సంకోచం..

ఆయిల్‌పాం తోటను సాగు చేసేందుకు ముందుకొచ్చిన రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఒక ఎకరానికి 50 మొక్కలు అవసరం అవుతుండగా, ఒక మొక్క ధర మార్కెట్‌లో రూ. 193 ఉంది. ఐతే, ప్రభుత్వం సబ్సిడీపై ఒక్కో మొక్కను కేవలం రూ. 20 అందజేస్తోంది. అదే విధంగా బిందుసేద్యం యూనిట్లను కూడా 90 శాతం సబ్సిడీపై ఇస్తోంది. ఇప్పటి వరకు వెయ్యి ఎకరాల దాకా డ్రిప్‌ను ఇచ్చారు. అదే విధంగా ఆయిల్ పాం తోట మధ్యలో అంతర పంటలు వేసే రైతులకు అందుకయ్యే ఖర్చును కూడా ప్రభుత్వం భరిస్తోంది. ఇన్ని రకాలుగా రైతులకు సబ్సిడీ ఇస్తున్నా కూడా చాలామంది రైతులు సందేహిస్తున్నారు. ఆయిల్‌పాం పంట నాలుగైదేళ్ల వరకు చేతికి రాదని, వచ్చినప్పుడు మార్కెట్‌లో సరైన రేటు వస్తుందో లేదోనని ఆలోచిస్తున్నారు. ఐతే, రైతుల సందేహాలు, అనుమానాలు తీర్చేందుకు పంట చేతికి వచ్చిన ఖమ్మం జిల్లాకు తీసుకెళ్తామని అధికారులు చెప్తున్నారు. ఇలా చేస్తే చాలామంది రైతులు మరింత ముందుకు వచ్చే అవకాశం ఉంది.

లాభదాయకమైన పంట..

ఆయిల్ పంట ఆలస్యమైనప్పటికీ మంచి లాభాలు వస్తాయి. రైతులు మంచి అవకాశాన్ని వదులుకోకుండా సబ్సిడీపై అందిస్తున్న మొక్కలు, డ్రిప్‌ను తీసుకుని సాగు చేయాలి. డీడీలు కట్టిన రైతులకు వెంటనే మొక్కలు ఇచ్చేందుకు ప్రస్తుతం ఆర్మూర్ దగ్గర చేపూర్ శివారులోని ప్రభుత్వ నర్సరీలో 1.50లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.

– నర్సింగ్‌దాస్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

నాణ్యత నగుబాటేనా..!

- నత్తనడకన సాగుతున్న మదర్ చైల్డ్ కేర్ ఆస్పత్రి పనులు
- పర్యవేక్షణ మరిచిన అధికారులు

నిజామాబాద్ నాగారం : పదికాలాల పాటు పదిలంగా ఉండాల్సిన భవన నిర్మాణాలు అధికారుల పర్యవేక్షణాలోపంతో ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. రెండేళ్లుగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి (మదర్ చైల్డ్ కేర్) సంబంధించి భవన నిర్మాణా పనులు నత్తనడకగా కొనసాగుతున్నాయి. ఈనెల చివరికల్లా కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కాని నాణ్యత విషయంలో సంబంధింత అధికారులు పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండడంతో ఇష్టారాజ్యంగా పనులు జరుగుతున్నాయి.

రూ. 23 కోట్లు మంజూరు

నగరంలో ఉన్న జీజీహెచ్ (ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి)కి రోగుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. ఖలీల్‌వాడిలోని బస్టాండ్‌కు ఎదురుగా గతంలోనే మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిని కేవలం ఒక్క ఫ్లోర్‌తో నిర్మించారు. కాని తమకు ఏమాత్రం సరిపోదని పేర్కొంటూ జీజీహెచ్ అధికారులు భవనాన్ని స్వాధీనం చేసుకునేందుకు ముందుకు రాలేదు. దీంతో భవనం అలాగే ఉండిపోయింది. చివరికి దానిపైనే మరో మూడు అంతస్తులు నిర్మించేందుకు రూ. 23 కోట్లు మంజూరు చేశారు. రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ) ద్వారా కాంట్రాక్టర్ నిర్మాణానికి సంబంధించి రూ. 17.64 కోట్లతో అగ్రిమెంట్ చేసింది.



ఇసుక స్థానంలో డస్ట్..

అయితే రెండేళ్లుగా పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. పనుల్లో నాణ్యత కూడా పరిశీలించే నాథుడు లేకుండా పోయారు. కాంట్రాక్టర్ చేసిందే పని అన్నట్లుగా మారింది. ఇసుక తక్కువగా డస్ట్ ఎక్కువగా వినియోగిస్తూ భవనం నిర్మిస్తున్నారు. సిమెంట్ ఇటుకల్లో కూడా నాణ్యత అంతంతమాత్రంగా ఉంది. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. అగ్రిమెంట్ ప్రకారం ఈ నెలలో భవనం పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు.

కాంట్రాక్టర్‌ను హెచ్చరించా..

భవన నిర్మాణ విషయంలో కచ్చితంగా అగ్రిమెంట్ ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే. పనుల్లో జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమే. నేను పలుమార్లు కాంట్రాక్టర్‌కు హెచ్చరించా. ఈ నెలలో పూర్తి చేయాల్సి ఉంది. స్వయంగా తనిఖీలకు వెళ్తున్నాను. – కుమార్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ

క్లుప్తంగా

జాతీయ చాంపియన్‌షిప్ పోటీలకు అదితి



నిజామాబాద్‌నాగారం: జాతీయ సీనియర్ మహిళా కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు అదితి ఎంపికైనట్లు కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంద్యాల లింగయ్య శుక్రవారం తెలిపారు. పంజాబ్‌లోని రూప్‌నగర్‌లో ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే 70వ సీనియర్ మహిళా కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టు క్రీడాకారిణి నోముల అదితి రాష్ట్ర కబడ్డీ సీనియర్స్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అదితిని కబడ్డీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారావు, సాయాగౌడ్, కె.గంగాధర్, బొబ్బిలి నర్సయ్య, చంద్రప్రకాశ్, రాజ్‌కుమార్, సురేందర్, ప్రశాంత్ అభినందించి సన్మానించారు.

సౌత్‌క్యాంపస్ విద్యార్థికి డాక్టరేట్ ప్రదానం

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో సోషల్ వర్క్ విభాగంలో పీహెచ్‌డీ స్కాలర్‌గా ఉన్న విద్యార్థి కే నరేందర్‌రెడ్డికి శుక్రవారం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. 'దివ్యాంగ పిల్లల పెంపకంపై తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు.. నల్లగొండ జిల్లా ఒక అధ్యయనం' అనే అంశంపై ఆయన సోషల్ వర్క్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఎం. విజయకుమార్‌శర్మ పర్యవేక్షణలో పరిశోధించారు. సౌత్‌క్యాంపస్ నుంచి డాక్టరేట్ పొందిన వారిలో ఆరవ విద్యార్థి నరేందర్‌రెడ్డి అని సోషల్ వర్క్ విభాగం అధిపతి డాక్టర్ రాజేశ్వరి తెలిపారు. సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ గంట చంద్రశేఖర్, ఇంచార్జి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ అంజయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

పీఎఫ్ సేవలు సులభతరం

- 'నిధి ఆప్కే నికట్'తో సమస్యలకు చెక్
- జనవరి నుంచి నవంబర్ వరకు ఉమ్మడి జిల్లాలో 22 కార్యక్రమాలు
- 906 ఫిర్యాదులు
- పరిష్కరించిన అధికారులు



ఖాతాదారుల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లు



పీఎఫ్ కార్యాలయం

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పీఎఫ్ ఖాతాదారులకు ఉన్నతాధికారులు ప్రవేశపెట్టిన పలు కార్యక్రమాలతో సేవలు మరింత సులభతరం అవుతున్నాయి. గతంలో పీఎఫ్ ఖాతాదారులకు సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కార్యాలయం చుట్టూ ఏళ్ల తరబడి తిరిగేవారు. తీరా అవి పరిష్కారం కాక.. కార్యాలయం చుట్టూ తిరగలేక చాలా మంది వాటి గురించి పట్టించుకోవడం మానేశారు. పనిచేసే సంస్థలో పేరు ఒకటి ఉంటే పీఎఫ్ కార్యాలయంలో మారో పేరు ఉండేది. దీంతో ఉద్యోగ విరమణ అనంతరం పీఎఫ్ డబ్బులు తీసుకోవాలంటే అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. పీఎఫ్ ఖాతాదారుల సమస్యలను గుర్తించిన నిజామాబాద్ పీఎఫ్ కార్యాలయ ఉన్నతాధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. కార్యాలయానికి వచ్చే పీఎఫ్ ఖాతాదారుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కారం చేస్తూ వారి మన్ననలు పొందుతున్నారు. అంతేకాకుండా ఖాతాదారుల సౌకర్యం 'నిధి ఆప్కే నికట్' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి వారి వద్దకే వెళ్లి సమస్యలను సంబంధిత అధికారులు తెలుసుకుంటూ అక్కడికక్కడే పరిష్కారం చూపుతున్నారు. ప్రతి నెలా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఒక మండల కేంద్రం, పట్టణంలో నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఖాతాదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారు. నిధి ఆప్కే నికట్ ఈ ఏడు జనవరి నుంచి మొదలు కాగా నవంబర్ వరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 22 కార్యక్రమాలు ఏర్పాటు చేయగా 906 ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులను పరిష్కరిస్తూ పీఎఫ్ కార్యాలయంపై ఖాతాదారులకు నమ్మకాన్ని కలిగిస్తున్నారు.

ప్రయాస్ పథకంతో..

ఏడాది క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రయాస్ పథకంతో వివిధ సంస్థల్లో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఐదుగురు కార్మికులకు ప్రతి నెలా పీఎఫ్ కార్యాలయంలో వీడ్కోల్ సమావేశం ఏర్పాటు చేస్తారు. వారికి రావాల్సిన డబ్బులను అప్పటికప్పుడు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసిన ప్రైవేట్ వ్యక్తులకు తగినంత గౌరవం ఇస్తున్నారు. దీంతో పీఎఫ్ ఖాతాలు ఉన్నవారు ఎవరైనా ఉద్యోగ విరమణఅనంతరం వారు జమ చేసుకున్న డబ్బులు త్వరగా వారి ఖాతాల్లో పీఎఫ్ కార్యాలయం జమ చేస్తోంది. డబ్బులు త్వరగా జమ కావడంతో ఖాతాదారులు సైతం కార్యాలయం చుట్టూ తిరిగే బాధలు తప్పాయి.

వారం రోజుల్లో పరిష్కారం



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పీఎఫ్ ఖాతాదారుల సమస్యలను వారం రోజుల్లోనే పరిష్కరిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో బీడీ కార్మికులు ఎక్కువగా ఉండటం, వారిలో చాలా మంది చదువుకోని వారు ఉండటంతో పేర్ల మార్పుల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఆధార్ కార్డు ప్రకారం తమ పేర్లు నమోదు చేసుకుంటే ఉద్యోగ విరమణ అనంతరం ఎలాంటి ఇబ్బంది ఉండదు. జిల్లాలో కొన్ని సంస్థల్లో ఎక్కువ మంది పనిచేస్తుంటే యాజమాన్యాలు తక్కువ మందితో ఖాతాలు తెరుస్తున్నారు. అలా చేస్తే యాజమాన్యాలపై చర్యలు తప్పవు.

– గణేశ్ కుమార్, పీఎఫ్ కమిషనర్

జాతీయ స్థాయిలో రాణించాలి



జెండా ఎగురవేస్తున్న జెడ్పీ చైర్మన్

నందిపేట్: రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందే క్రీడాకారులు జాతీయస్థాయిలోనూ రాణించాలని జెడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండలంలోని లక్కంపల్లి శివారులో 42వ రాష్ట్రస్థాయి జూనియర్ ఇంటర్ బాలబాలికల ఖోఖో పోటీలను శుక్రవారం ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో ఉమ్మడి 10 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని జిల్లా ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ అతిఖుల్లా తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరందం, తెలంగాణ ఖోఖో సంఘం అధ్యక్షులు జంగారాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు భూమారెడ్డి, చైర్మన్ అనిల్, రాష్ట్ర ఒలింపిక్ అబ్జర్వర్ లింగన్న, ప్రశాంత్, జిల్లా ఒలింపిక్ అబ్జర్వర్ బొబ్బిలి నర్సయ్య, టోర్నమెంట్ కన్వీనర్ సాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీసాల సుజాత, నాయకులు పాల్గొన్నారు.

టీఎన్జీవో ఆధ్వర్యంలో సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న టీఎన్జీవోస్ సభ్యులు

సుభాష్‌నగర్: నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి టీఎన్జీవో కేంద్ర సంఘం ఆదేశానుసారం జిల్లా చైర్మన్ అలుక కిషన్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. పటాకులు కాల్చి సంబురాలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును మర్యాదపూర్వకంగా కలిసి నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి ఉద్యోగులందరం సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శేఖర్, టీజీవో ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అమృత్‌కుమార్, కార్యదర్శి హన్మంత్‌రెడ్డి, చిట్టి నారాయణ రెడ్డి, ఆకుల ప్రసాద్, పోల శ్రీనివాస్, రవీందర్, భోజాగౌడ్, రాంజీ, గొండ స్వామి, కిశోర్, ఉద్యోగులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి ప్రారంభించనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బ్యూటీపార్లర్, మగ్గం వర్క్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని అన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని గ్రామీణ యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి సౌకర్యం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణపత్రం, టూల్ కిట్ అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08461–295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మలేషియాలో చిక్కుకున్న యంచ వాసి

- ఎమ్మెల్సీ చొరవతో స్వగ్రామానికి..



భార్య, కూతురుతో రాజు

నవీపేట: మండలంలోని యంచ గ్రామానికి చెందిన యువకుడు మలేషియాలో చిక్కుకోగా ఎమ్మెల్సీ కవిత చొరవతో శుక్రవారం స్వగ్రామానికి చేరుకున్నాడు. యంచ గ్రామానికి చెందిన నూనెరాజు ఎనిమిది నెలల క్రితం ఉపాధి కోసం మలేషియా వెళ్లాడు. ఏజెంట్ మోసం చేయడంతో అక్కడ పని లేక అవస్థలు పడ్డాడు. అక్కడి పోలీసులు జరిమానా విధించారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో కుటుంబ సభ్యులకు వివరించాడు. మాజీ ఉప సర్పంచ్ లాలూయాదవ్, బీఆర్‌ఎస్ మండల నాయకుడు సంజీవ్ ఈ విషయాన్ని ఎమ్మెల్సీ కవితకు వివరించారు. స్పందించిన ఆమె రూ. 65 వేలు చెల్లించి, స్వగ్రామానికి రప్పించారు. శుక్రవారం ఇంటికి చేరుకున్న రాజు ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

జీజీహెచ్ నుంచి విద్యార్థుల డిశ్చార్జ్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఫుడ్‌పాయిజన్‌తో చికిత్స పొందుతున్న 16 మంది విద్యార్థులు శుక్రవారం డిశ్చార్జ్ అయినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. నగరంలోని బోర్గాం(పి) పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం వికటించడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. గమనించిన ఉపాధ్యాయులు ఆస్పత్రిలో చూయించారు. శుక్రవారం సాయంత్రం వరకు విద్యార్థుల పరిస్థితి మెరుగు కావడంతో డిశ్చార్జ్ చేసినట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు.

ఓపీ రిజిస్ట్రేషన్ ఉంటేనే..

- మధ్యాహ్న భోజనం వికటించిన విద్యార్థులకు ఆలస్యంగా అందిన వైద్యసేవలు



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని బోర్గాం(పి) పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి అస్వస్థకు గురై ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన విద్యార్థులపై జీజీహెచ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రిజిస్ట్రేషన్ ఉంటేనే వైద్యం చేస్తామనడంపై సర్వత్రా చర్చకు తెరలేపింది. గురువారం బోర్గాం(పి) పాఠశాలలో 16 మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనం వికటించి వాంతులు, విరోచనాలు కావడంతో పాఠశాల సిబ్బంది వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి సమాచారం అందించారు. వారు అంబులెన్స్‌లో విద్యార్థులను తరలించిన అనంతరం వైద్య సిబ్బంది విద్యార్థులను రిసీవ్ చేసుకోలేదు. పైగా పేషంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉంటేనే లోనికి అనుమతి ఇస్తామనడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు కడుపు నొప్పి, విరేచనాలు బాధ పడుతున్నా పాఠశాల సిబ్బంది నుంచి రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకున్న తర్వాతే జీజీహెచ్ వైద్య సిబ్బంది చికిత్స చేశారు. పిల్లలు కొంతమంది నేలపైనే పడిపోయి ఏడుపులు పెట్టారు. అయినా సిబ్బంది విద్యార్థులకు అందించలేదు. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో పాఠశాల సిబ్బంది, జీజీహెచ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పెట్టుబడి సాయం ఎప్పుడో..

మోర్తాడ్: యాసంగి సీజన్ పంటల సాగు ఆరంభమైన తరుణంలోనే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా పెట్టుబడి సాయాన్ని పెంచి ఇస్తారా అని రైతులు ఎదురుచూస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతుబంధు స్థానంలో రైతుభరోసా పథకం కింద రైతులు, కౌలు రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.15వేల చొప్పున సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొంది. ఆరు గ్యారంటీలలో రైతుభరోసా కూడా కీలకమైనది కావడంతో పెట్టుబడి సాయంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అందరూ ఆశించినట్లుగానే అభయహస్తం ఆరు గ్యారంటీలపైనే సీఎం రేవంత్‌రెడ్డి తన తొలి సంతకం చేశారు. యాసంగి పెట్టుబడి సాయాన్ని గడిచిన నవంబర్‌లోనే అందించడానికి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అంతలోనే నాటి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ఎన్నికల కమిషన్ బ్రేక్ వేసింది. పెట్టుబడి సాయం జమ చేయకపోవడానికి కారణం మీ పార్టీలే అంటూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు పరస్పర విమర్శలు చేసుకుంటున్నాయి. జిల్లాలో గతంలో 2,78,351 మంది రైతులకు పెట్టుబడి సాయం అందింది. అప్పట్లో వీరికి రూ.274 కోట్లు మంజూరి చేశారు. గతంలో ఒక సీజనులో ఎకరానికి రూ.5వేల చొప్పున సాయం అందించేవారు. ఇప్పుడు పెట్టుబడి సాయం పెంచితే ఎకరానికి రూ.7,500ల చొప్పున సాయం అందుతుంది. అంటే జిల్లాకు మంజూరయ్యే నిధుల మొత్తం పెరుగుతుంది. ప్రభుత్వం ఏ మేరకు చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

మొరం క్వారీలపై దాడులు

- రెండు టిప్పర్లు పట్టివేత

మాక్లూర్: మండలంలోని మాదాపూర్, చిన్నాపూర్‌లో అనుమతులు లేకుండా కొనసాగుతున్న మొరం క్వారీలపై శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు చేసి రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, ఎస్సై సుధీర్‌రావు కథనం మేరకు.. కొంత కాలంగా మాక్లూర్‌లో అక్రమ మొరం క్వారీలు కొనసాగుతున్నాయి. పలు సార్లు పట్టుకుని జరిమానాలు విధించినప్పటికి అక్రమ మొరం వ్యాపారుల్లో మార్పు కన్పించలేదన్నారు. రాత్రి జిల్లా కేంద్రం నుంచి టాస్క్‌ఫోర్సు పోలీసుల బృందాలు సమాచారం ఇవ్వటంతో వారితో కలిసి మాదాపూర్, చిన్నాపూర్ శివారులలో మొరం క్వారీలపై దాడులు చేశామన్నారు. మాదాపూర్ గుట్ట నుంచి అక్రమంగా తరలించుక పోతున్న రెండు మొరం టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే చిన్నాపూర్ శివారులో కూడా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. చిన్నాపూర్ క్వారీకి అనుమతి ఉందా లేదా అనేది తెలియాల్సి ఉందన్నారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిగినట్లు సమాచారం.

క్రైం కార్నర్

ఫిట్స్‌తో ఒకరి మృతి

ఎడపల్లి: మండల కేంద్రంలో ఓ యువకుడిని ఫిట్స్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. ఎడపల్లికి చెందిన ఆరె శేఖర్(33) ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయం పనినిమిత్తం మండల కేంద్రంలోని మంగళ్‌పాడ్ చౌరస్తాకు నడుచుకుంటూ వెళ్తుండగా ఫిట్స్ వచ్చి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మరొకం

నందిపేట్: మండలంలోని షాపూర్ శివారులో స్పృహ కోల్పోయిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 2న షాపూర్ శివారులో గుర్తు తెలియని వ్యక్తి స్పృహ కోల్పోయినట్లు సమాచారం అందడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 55 ఏళ్ల వరకు ఉంటుందని, నలుపు రంగు జీన్‌ప్యాంట్, పసుపు కలర్ షర్ట్ వేసుకొని ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా



భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి శివారులో వరిధాన్యంతో వెళ్తున్న ట్రాక్టర్ శుక్రవారం బోల్తాపడింది. పెద్దమల్లారెడ్డి విండో ఆధ్వర్యంలో కంచర్లలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో రైస్ మిల్లుకు తరలిస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న విండో చైర్మన్ రాజాగౌడ్ వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ధాన్యం బస్తాలను వేరే ట్రాక్టర్ ద్వారా రైస్ మిల్లుకు తరలించారు.

రెండు బైక్‌లు, ఆటో చోరీ





బాన్సువాడలో బైక్, ఆటోను దొంగిలిస్తున్న దుండగులు

బాన్సువాడ: పట్టణంలో గురువారం రాత్రి రెండు బుల్లెట్ వాహనాలు, ఓ ఆటో చోరీకి గురయ్యాయి. మిస్త్రీ గల్లీలో ఒక బుల్లెట్ బైక్, చైతన్య కాలనీలో మరో బుల్లెట్ బైక్, సంగమేశ్వర కాలనీలో ఆటోను దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. మూడు వాహనాలు ఒకే సారి చోరీకి గురి కావడంతో పట్టణ వాసులు ఆందోళనకు గురవుతున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

బోధన్‌టౌన్: పట్టణంలోని శివాలయం రోడ్డులో కోట అబ్బయ్యకు చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని సీఐ వీరయ్య తెలిపారు. అబ్బయ్య ఈ నెల 5న తన ఇంటి ఎదుట బైక్ నిలిపి ఉంచి నిద్రించాడు. ఉదయం బైక్ కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పెర్కిట్‌లో బైక్..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఓ బైక్ గురువారం రాత్రి చోరీకి గురైంది. గ్రామానికి చెందిన చందు తన ఇంటి ఎదుట బైక్‌ను రాత్రి నిలిపి ఉంచగా ఉదయం లేచి చూసే సరికి కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఆవు కళేబరం



గేదె కళేబరం

బిచ్కుంద/ ఎల్లారెడ్డి రూరల్: బిచ్కుంద మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆవు తగలడంతో విద్యుదాఘాతం సంభవించి శుక్రవారం మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో మేత మేస్తున్న ఆవుకు తీగలు తగలడంతో మృతి చెందింది. గతంలో కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని సబ్దల్‌పూర్‌లో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బత్తుల అంజయ్యకు చెందిన గేదె మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలకు తగలడంతో మృతి చెందిందని అన్నారు. అధికారులు స్పందించి పరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి కోతి మృతి..



కోతి కళేబరం

ఎల్లారెడ్డి: పట్టణంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై కోతి పడి మృతి చెందింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పట్టణంలోని ఓ రైస్ మిల్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు కోతి పడి మృతి చెందింది. అధికారులు స్పందించి మృతి చెందిన కోతిని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

లారీలో ఆవు, ఎద్దు..



రెంజల్: మండలంలోని సాటాపూర్‌లో శనివారం నిర్వహించే పశువుల సంతకు మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న పశువుల లారీని స్థానిక యువకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సాటాపూర్ సంతలో లారీ నుంచి పశువులను కిందికి దింపుతుండగా అందులో ఉన్న ఆవుతో పాటు ఒక ఎద్దు మృతి చెందింది. ఇది చూసిన స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్ గ్రామానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. లారీలో మరో 14 ఎద్దులు ఉన్నట్లు గుర్తించినట్లు సీఐ పేర్కొన్నారు. పూర్తి వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటామన్నారు. పరిమితికి మించి అక్రమంగా రవాణా చేయడంతోనే ఆవు మృతిచెందినట్లు యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోపీకృష్ణ ఫిర్యాదు మేరకు లారీని స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు.

యువతి అదృశ్యం

మోపాల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ శుక్రవారం తెలిపారు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన రమాదేవి తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

గోదావరిలో బాలిక మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం శివారులోని గోదావరి నదిలో గుర్తు తెలియని బాలిక మృతదేహం లభ్యమైనట్లు ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గోదావరిలో తెప్ప పూజకు వచ్చిన భక్తులకు గోనె సంచిలో మృతదేహం ఉన్నట్లు తెలుసుకొని గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఏసీపీ జగదీశ్, ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సుమారు 15 ఏళ్ల బాలిక మృతదేహం లభ్యమైందని బాలికను ఎవరో హత్య చేసి గోదావరిలో పడేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఆయన వెంట భీంగల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు శ్రీనివాస్, గోపీ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లిలో దొంగల హల్‌చల్

- 35తులాల బంగారం, రూ. 5 వేల నగదు అపహరణ
- క్లూస్ టీం వేలిముద్రల సేకరణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం అధికారులు



దొంగతనం జరిగిన ఇంటి వద్ద మహిళలు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో దొంగలు గురువారం రాత్రి హల్ చల్ చేశారు. ఓ ఇంట్లోకి ప్రవేశించి భారీ మొత్తంలో బంగారం, నగదు దొంగిలించగా, ఓ జ్యువెల్లరీ షాప్‌లో సైతం చోరీకి పాల్పడ్డారు. మరో రెండిళ్లలో చోరీకి యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కమ్మర్‌పల్లిలోని పుడికారం బాపురెడ్డి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాపురెడ్డి భార్య పుట్టింటికి వెళ్లగా, ఆయన ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తల్లిదండ్రులున్న ఇంట్లో నిద్రించాడు. దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 35 తులాల బంగారం, రూ. 5 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాపురెడ్డి తల్లి ఉదయం నిద్రలేచి చూగా గది తాళం కింద పడేసి ఉండడంతో కొడుకును, భర్తను నిద్ర లేపింది. వారు ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాజశేఖర్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అంతేకాకుండా దుండగులు ఆలయం పక్కనే ఉన్న జ్యువెల్లరీ షాప్ తాళం పగుల గొట్టి రూ. 6 వేలు విలువ చేసే బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అదే వాడలో ఉన్న మరో ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నించారు. వైన్ షాప్ పక్కన ఉన్న ఇంట్లోకి ప్రవేశించగా వ్యక్తి పడుకొని ఉండడంతో దుండుగు బయటకి వెళ్లిపోయారు. నిజామాబాద్ క్లూస్ టీం బృందానికి, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. క్లూస్ టీం బృందం ఘటనా స్థలానికి చేరుకొని నిందితుల వేలిముద్రలను సేకరించారు. సీసీఎస్ ఏసీపీ విజయ్ సారథి, సీఐ రమేశ్, భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు ఘటన స్థలాన్ని సందర్శించారు. దొంగతనంపై సీసీఎస్ అధికారులు లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.